సాక్షి
విశాఖపట్నం
గురువారం । 26 । సెప్టెంబర్ । 2024



ఎందుకీ నిర్లక్ష్యం? 8లో

యు–డైస్ ప్లస్ వెబ్‌సైట్‌లో వాస్తవ వివరాలు నమోదు చేయడంలో కొన్ని ప్రైవేట్ యాజమాన్యాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయి.



డేటా సెంటర్ స్థలం పరిశీలన

కాపులుప్పాడలో గల అదానీ డేటా సెంటర్ స్థలాన్ని మంత్రి నారా లోకేష్, ఎంపీ శ్రీభరత్‌తో కలిసి పరిశీలించారు. 8లో



వైశాఖీ నృత్యోత్సవం షురూ

వైశాఖీ నృత్యోత్సవం–2024 కళాభారతి ఆడిటోరియంలో ఈ నెల 27, 28, 29 తేదీల్లో సమ్మోహనం చేయనుంది. 8లో

న్యూస్‌రీల్

నేడు హెరిటేజ్ వాక్

వలు అంశాల్లో విద్యార్థులకు పోటీలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని జిల్లాలో అట్టహాసంగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎం.ఎస్.హరేందిర ప్రసాద్ తెలిపారు. గురువారం ఉదయం 6 గంటలకు ఆర్కే బీచ్ రోడ్‌లో హెరిటేజ్ వాక్, ఉదయం 9 నుంచి 12 గంటల వరకు వివిధ అంశాల్లో పోటీలు ఉంటాయన్నారు. 27న ఉదయం 6 గంటలకు విశ్వప్రియ ఫంక్షన్ హాలు నుంచి విక్టరీ సీ వరకు టూరిజం వాక్, సాయంత్రం 6 గంటల నుంచి వీఎంఆర్‌డిఏ చిల్డ్రన్ ఎరీనాలో 'టూరిజం–పీస్' థీమ్‌తో వేడుకలు జరుగుతాయని పేర్కొన్నారు. కార్యక్రమాల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు చేయాలని టూరిజం, జీవీఎంసీ, వీఎంఆర్డీఏ అధికారులను ఆదేశించారు.

ఐదుగురు సీఐలకు స్థానచలనం



విశాఖ సిటీ: నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో అయిదుగురు ఇన్‌స్పెక్టర్లకు స్థానచలనం కలిగింది. ఇందులో రేంజ్ నుంచి వచ్చిన ఇద్దరికి పోస్టింగ్ ఇవ్వగా.. ఇక్కడి నుంచి రేంజ్‌కు ఇద్దరిని సరెండర్ చేశారు. ఈ మేరకు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. రేంజ్ నుంచి వచ్చిన వి.చంద్రశేఖర్‌ను కంచరపాలెం లా అండ్ ఆర్డర్ సీఐగా వేశారు. ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న ఎస్.భాస్కర్‌రావును సిటీ టాస్క్‌ఫోర్స్–1కు బదిలీ చేశారు. అలాగే రేంజ్ నుంచి వచ్చిన జి.అప్పారావును సోషల్ మీడియా సెల్, సీఎంఎస్‌లో పోస్టింగ్ ఇచ్చారు. ఇక్కడ ఉన్న బి.లక్ష్మణరావును, సీఎస్‌బీ పొలిటికల్‌లో ఉన్న వి.రామారావును రేంజ్‌కు సరెండర్ చేశారు.

వీఎంఆర్‌డీఏ సీయూపీగా శిల్ప బాధ్యతల స్వీకరణ



విశాఖ సిటీ: వీఎంఆర్‌డీఏ చీఫ్ అర్బన్ ప్లానర్(సీయూపీ)గా వి.శిల్ప బుధవారం బాధ్యతలు స్వీకరించారు. వీకేపీసీపీఐఆర్ నుంచి విధులు నిర్వరిస్తున్న ఈమెను ప్రభుత్వం ఇటీవలే వీఎంఆర్‌డీఏకు బదిలీ చేసింది. ఇప్పటి వరకు ఇక్కడ విధులు నిర్వర్తించిన సంజయ్‌రత్నకుమార్‌ను వీకేపీఐఆర్‌కు పంపించారు. దీంతో వీఎంఆర్‌డీఏ నూతన సీయూపీ శిల్ప బాధ్యతలు చేపట్టారు.

గృహనిర్మాణాల వేగవంతానికి చర్యలు

మహారాణిపేట: పేదల సొంతింటి కలను నిజం చేయడంలో నిర్లిప్త ధోరణి కనబరిస్తే ఉపేక్షించేది లేదని కలెక్టర్ ఎంఎస్ హరేందిర ప్రసాద్ సంబంధిత అధికారులను హెచ్చరించారు. బుధవారం కలెక్టరేట్‌లో గృహ నిర్మాణాల ప్రగతిపై సమీక్షించారు. సోమవారం నుంచి అన్ని లేఅవుట్లలో నిర్మాణాలు జరగాలన్నారు. సంబంధిత అధికారులు చిత్తశుద్ధితో పనిచేసి, ప్రగతి సాధించాలని సూచించారు. ఇసుక, సిమెంట్, ఐరన్, ఇటుక తదితర సమస్యలు లేకపోయినా పనుల్లో పురోగతి కనిపించకపోవడం శోచనీయమన్నారు. లబ్ధిదారులు తామే నిర్మించుకునేందుకు ముందుకొచ్చేలా ఈ నెల 27, 28, 29 తేదీల్లో చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. రోజుకు 100 ఇళ్ల స్టేజ్ అప్‌డేషన్ జరగాలని నిర్దేశించారు. మార్చి 2025 నాటికి అన్ని లేఅవుట్లలో ఆర్సీ స్టేజికి ఇళ్లను తీసుకురావాలని పేర్కొన్నారు. సమావేశంలో గృహ నిర్మాణ శాఖ పీడీ డి.అఖిల, ఇంజినీరింగ్ అధికారులు, గుత్తేదార్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఎమినిటీస్ సెక్రటరీలు పాల్గొన్నారు.

ఎక్సైజ్ డీసీగా శ్రీరామ్మూర్తి

- ఏసీగా మహేష్‌కుమార్
- సూపరింటెండెంట్‌గా ప్రసాద్

విశాఖ సిటీ: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్‌గా డి.శ్రీరామ్మూర్తి నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఇక్కడ డీసీగా విధులు నిర్వర్తించిన ఎం.జయరాజు కడపకు బదిలీ అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీరామ్మూర్తి ఇప్పటి వరకు విశాఖ ఎస్ఈబీలో విధులు నిర్వర్తించి ఇటీవలే రిలీవ్ అయ్యారు. పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న ఆయనను విశాఖ ఎక్సైజ్ డీసీగానే నియమించారు. అలాగే ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్‌గా బాపట్ల ఎస్ఈబీ నుంచి రిలీవ్ అయి పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న సిహెచ్.మహేష్‌కుమార్ నియమితులయ్యారు. అదే విధంగా ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా ఆర్.ప్రసాద్‌ను నియమించారు. ఇప్పటివరకు ఇక్కడ విధులు నిర్వర్తించిన వి.సుధీర్‌ను అనకాపల్లికి బదిలీ చేశారు.

నామినేటెడ్.. ఫ్రస్టేటెడ్

- నామినేటెడ్ పదవులు దక్కని నేతల్లో నైరాశ్యం
- పార్టీ కోసం కష్టపడిన గుర్తింపు లేదని మండిపాటు
- పార్టీ నిర్ణయంపై అసంతృప్తి

అధికార పార్టీలో అసంతృప్తుల గోల!



సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

అధికారపార్టీ కూటమి నేతల్లో అసంతృప్తి మొదలైంది. మొదటి దఫా నామినేటెడ్ పోస్టుల్లో పదవులు దక్కని నేతలందరూ ఫ్రస్ట్రేషన్‌కు గురవుతున్నారు. పార్టీ నిర్ణయంపై మండిపడుతున్నారు. పార్టీలో మొదటి నుంచీ కష్టపడిన తమకు గుర్తింపు దక్కకపోవడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. సీటు ఆశించి దక్కకపోయినా పార్టీ గెలుపు కోసం కష్టపడిన తమను గుర్తించకపోవడంపై అసంతృప్తిని వెలిబుచ్చుతున్నారు. ప్రధానంగా పార్టీలో సీనియర్లుగా ఉన్న తమకు కాకుండా కొద్ది మందికి మాత్రమే పదవులు వరించడాన్ని ఆహ్వానించలేకపోతున్నారు. అటు టీడీపీతో పాటు ఇటు జనసేన పార్టీలో ప్రధానంగా ఈ అసంతృప్తులు ఎక్కువగా ఉన్నారు. సీట్ల సర్దుబాటు పేరుతో తమకు సీటు దక్కకపోయినప్పటికీ మిన్నకుండిపోయామని... కూటమి పార్టీ గెలుపు కోసం కష్టపడిన తమకు ఇచ్చే గుర్తింపు ఇదేనా అని వాపోతున్నారు.

ఇరు పార్టీల్లోనూ ఇదే లొల్లి...!

కూటమి పార్టీల్లో ప్రధానంగా టీడీపీ, జనసేన పార్టీల నుంచి ఎక్కువగా అసంతృప్తి వ్యక్తమవుతోంది. జనసేన పార్టీకి చెందిన ఏ ఒక్కరికీ కూడా ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి కార్పొరేషన్ చైర్మన్ పదవి దక్కలేదు. కేవలం టీడీపీకి చెందిన పీలా గోవింద్‌కు మాత్రమే పదవి వరించింది. దీంతో ప్రధానంగా జనసేన నేతల్లో వ్యతిరేకత కనిపిస్తోంది. ఇక తెలుగుదేశం పార్టీలో కూడా సీనియర్లుగా ఉండి.. ప్రతిపక్షంలో కూడా పార్టీతో పాటు ఉండి.. నియోజకవర్గంలో కలియతిరిగిన తమను గుర్తించకపోవడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు.

- యలమంచిలి నియోజకవర్గానికి చెందిన ప్రగడ నాగేశ్వరరావు, పప్పల చలపతిరావులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది.
- జనసేన నుంచి భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న పంచకర్ల సందీప్, విశాఖ ఉత్తర నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న పసుపులేటి ఉషాకిరణ్‌లు పొత్తులో సీటును కోల్పోయారు. దీంతో వీరిద్దరూ తమకు ఏదో ఒక పదవి దక్కకపోతుందా అని ఆశించారు. ఈ జాబితాలో వీరికి మొండిచెయ్యి ఎదురైంది.
- విశాఖ దక్షిణ సీటు ఆశించి భంగపడిన టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీకి నామినేటెడ్ పోస్టు దక్కలేదు. పైకి ఏమీ మాట్లాడనప్పటికీ లోలోన మాత్రం ఈయన కూడా మండిపడుతున్నట్టు సమాచారం.
- పార్టీలో సీనియరు నేతలుగా ఉన్న మహమ్మద్ నజీర్, విశాఖ తూర్పు నియోజకవర్గం నుంచి మాజీ కార్పొరేటర్ సన్యాసిరావు... గతంలో ఎమ్మెల్యే టికెట్ కోసం ప్రయత్నించారు. టికెట్ రాకపోవడంతో నామినేటెడ్ పోస్టును ఆశించారు.
- గతంలో జీవీఎంసీ ఫ్లోర్ లీడరుగా పనిచేసిన పట్టాభికి కూడా నిరాశే ఎదురైంది.
- దాడి వీరభద్రరావు కుమారుడు దాడి రత్నాకర్ ఎమ్మెల్సీ పదవి లేదా ఏదైనా నామినేటెడ్ చైర్మన్ పోస్టు ఆశించారు. అతడికి మొండి చెయ్యి చూపడంతో బయటికి ఏమీ మాట్లాడకపోయినా దిగువ కేడర్ నుంచి తనకు పదవి ఇవ్వాలనే డిమాండ్ ఉంచేలా సంకేతాలు పంపిస్తున్నారు.
- మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీశ్వరరావు మరోసారి ఎమ్మెల్సీగా చేయాలని ఉంది అని సన్నిహితుల వద్ద అంటున్నాడు.
- బీజేపీ సీనియర్ నాయకుడు పరుచూరి భాస్కరరావు రాష్ట్ర బీజేపీ నుంచి ఏదైనా పదవి వస్తాదేమో అని ఎదురుచూస్తున్నారు.

ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి ఏ ఒక్క జనసేన, బీజేపీ నేతకు ఎటువంటి కార్పొరేషన్ చైర్మన్ పోస్టు దక్కకపోవడం ఆ పార్టీ నేతల్లో చర్చనీయాంశమవుతోంది.

ఏజెన్సీలో అదే వేడి...!

ఒకవైపు వర్షాలతో సాధారణ వాతావరణం కొద్దిగా చల్లబడినప్పటికీ... రాజకీయ వాతావరణం మాత్రం వేడెక్కుతోంది. ఏజెన్సీలో మాజీ మంత్రి మణికుమారి, అరకు నుంచి టికెట్ ఆశించి... పోటీ నుంచి తప్పుకున్న దొన్నుదొరతో పాటు పాడేరులో సీనియర్ నేతలుగా ఉన్న చల్లంగి జ్ఞానేశ్వరి, ఎంవీఎస్ ప్రసాద్‌లతో పాటు జనసేన నుంచి పాడేరు టికెట్ ఆశించిన వొంపురి గంగులయ్యలకు ఎటువంటి పదవులు దక్కలేదు. వీరంతా పార్టీ నిర్ణయంపై అసంతృప్తితో ఉన్నట్టు తెలుస్తోంది. పార్టీని నమ్ముకున్న తమకు ఎటువంటి పదవులు ఇవ్వకపోవడంపై మండిపడుతున్నట్టు సమాచారం. పార్టీలో మొదటి నుంచీ పనిచేసిన వారికి గుర్తింపు దక్కడం లేదని ఈ నేతలందరూ లోలోపల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తర్వాత ప్రకటించే నామినేటెడ్ పోస్టుల జాబితాలో కూడా తమకు గుర్తింపు దక్కకపోతే మాత్రం బహిరంగంగా అసంతృప్తి వెళ్లగక్కేందుకు కొద్ది మంది నేతలు సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది.

మూడు నెలల ముచ్చటే..

- ఐపీఎస్ బదిలీల గందరగోళం
- అనకాపల్లి ఎస్పీ దీపిక, విశాఖ డీసీపీ–2 బదిలీ
- రెండు నెలల్లోనే స్థాన చలనాలు
- విశాఖ డీసీపీ–2గా మేరీ ప్రశాంతి
- అనకాపల్లి ఎస్పీగా తుహిన్ సిన్హా
- విశాఖ జాయింట్ సీపీ పోస్టు హుష్‌కాకి?



మేరీ ప్రశాంతి



తుహిన్ సిన్హా



ఫక్కీరప్ప



దీపిక

విశాఖ సిటీ: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి వంద రోజులు దాటింది. ఐపీఎస్‌లకు పోస్టింగ్‌లు ఇచ్చి 70 రోజులే అయింది. మూడు నెలల ముచ్చట తీరకముందే వారిపై బదిలీ వేటు పడింది. దీంతో ఐపీఎస్‌ల్లో గందరగోళ పరిస్థితి నెలకొంది. ఎందుకు పోస్టింగ్ ఇస్తున్నారో? ఎందుకు బదిలీ చేస్తున్నారో? అర్థం కాక తలలు పట్టుకుంటున్నారు. ప్రభుత్వానికి ఇప్పటికీ ఒక క్లారిటీ లేకపోవడంతోపాటు కొంత మంది అధికారులను విశ్వసించలేకపోవడంతోనే బదిలీల అంశం జఠిలంగా మారుతోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఐపీఎస్‌లతో పాటు డీఎస్పీ పోస్టింగ్ విషయంలో కూడా కూటమి ప్రభుత్వం తాత్సారం చేస్తోంది. ప్రభుత్వం ఏర్పాటై వంద రోజులవుతున్నా నగరంలో ఏసీపీల పోస్టింగ్ విషయంలో మాత్రం జాప్యం చేస్తూనే ఉంది. రెండు నెలల క్రితమే విశాఖ డీసీపీ–2గా తుహిన్ సిన్హా, అనకాపల్లి ఎస్పీ దీపిక ఎం.పాటిల్‌ను నియమించిన ప్రభుత్వం తాజాగా బదిలీ చేసింది.

ఎందుకిచ్చారు.. ఎందుకు బదిలీ చేశారు..

అల్లూరి జిల్లా ఎస్పీగా ఉన్న తుహిన్ సిన్హాను కూటమి ప్రభుత్వం వచ్చాక విశాఖ డీసీపీ–2గా నియమించింది. ఇప్పుడు ఆయన్ని ఇక్కడి నుంచి బదిలీ చేశారు. అనకాపల్లి ఎస్పీగా దీపిక ఎం.పాటిల్ ఈ ఏడాది జూలై 14న బాధ్యతలు చేపట్టారు. ఇప్పుడు ఆమెను కాకినాడ ఏపీఎస్పీ 3వ కమాండెంట్‌గా నియమించారు. ఆమె స్థానంలో డీసీపీ–2గా ఉన్న తుహిన్ సిన్హాకు అవకాశం కల్పించారు. రెండు నెలల్లోనే ఐపీఎస్‌ల మార్పులపై పోలీస్ అధికారులు సైతం కొంత అసంతృప్తిగా ఉన్నట్లు తెలుస్తోంది.

రాజకీయ కారణాలతోనే వేటు..

అనకాపల్లి ఎస్పీ బదిలీ విషయంలో అనేక ఊహాగానాలు చెలరేగుతున్నాయి. రాజకీయ కారణాలు, ఒత్తిళ్లతోనే ఆమెపై బదిలీ వేటు పడిందన్న వార్తలు గుప్పుమంటున్నాయి. ప్రధానంగా అనకాపల్లి జిల్లాలో ఒక జనసేన ఎమ్మెల్యేతో పాటు, టీడీపీకి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు ఆమెను బదిలీ చేయాలని ప్రభుత్వ పెద్దలపై ఒత్తిడి తీసుకువచ్చినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. అనకాపల్లి ఎస్పీగా మహిళ అధికారి వద్దని చెప్పడం కారణంగానే ఆమెను ఇక్కడి నుంచి కాకినాడ ఏపీఎస్పీకి పంపించారన్న టాక్ ఉంది.

జాయింట్ సీపీ పోస్టు లేనట్టేనా?

విశాఖ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఫక్కీరప్పను బదిలీ చేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయనను ఇక్కడ నుంచి ఇంటెలిజెన్స్ ఎస్పీగా నియమించింది. ఆయన స్థానంలో ఎవరినీ నియమించకపోవడంతో జాయింట్ సీపీ సీటు మళ్లీ ఖాళీ అయిపోయింది. మెట్రో నగరాలకు దీటుగా అభివృద్ధి చెందుతున్న విశాఖలో పోలీస్ వ్యవస్థను పటిష్టం చేసేందుకు గత ప్రభుత్వం జాయింట్ కమిషనర్ పోస్టును భర్తీ చేసింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ముందు కూడా చాలా ఏళ్లు ఈ సీటు ఖాళీగా ఉండిపోయింది. అప్పట్లో కూడా టీడీపీ ప్రభుత్వమే జేసీపీ పోస్టును భర్తీ చేయలేదు. తాజాగా మళ్లీ జాయింట్ సీపీ పోస్టును భర్తీ చేయకపోవడంతో.. మళ్లీ ఆ సీటు ఖాళీగానే ఉండే అవకాశం ఉందని పోలీస్ శాఖలో చర్చ జరుగుతోంది.

రెండో రోజూ కూటమి రచ్చే..

- వ్యక్తిగత దూషణలకే పరిమితం
- స్థానిక సమస్యలు పక్కనపెట్టి ఆరోపణలతో వాగ్వాదం
- రాత్రి 8 వరకూ జీరో అవర్ పేరిట కాలయాపన
- వైఎస్సార్ సీపీ ఫ్లోర్ లీడర్ బాణాలపై దాడికి యత్నించిన కూటమి సభ్యులు
- అజెండాలోని 75 అంశాల్లో 14 అంశాలపై చర్చ
- గురువారం మధ్యాహ్నం రెండు గంటలకు సమావేశం వాయిదా



మేయర్‌ను బెదిరిస్తున్న జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్, కూటమి కార్పొరేటర్లు



వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లతో కూటమి కార్పొరేటర్ల వాగ్వాదం

సాక్షి, విశాఖపట్నం : రెండో రోజు కౌన్సిల్ సమావేశంలోనూ కూటమి కార్పొరేటర్లు రచ్చ చేశారు. వార్డు సమస్యలు పక్కనపెట్టి వ్యక్తిగత ఆరోపణలతో సమయాన్ని వృథా చేశారు. సభా మర్యాదలు పాటించకుండా దూషణలతో రెచ్చిపోయారు. మంగళవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో కూటమి కార్పొరేటర్ల రచ్చ కారణంగా అజెండాలో ఒక్క అంశంపై కూడా చర్చ జరగకుండానే సమావేశం వాయిదా పడింది. బుధవారం కూడా సొంత అజెండాతో రెచ్చిపోయారు. మేయర్ గొలగాని హరివెంకటకుమారి అధ్యక్షతన బుధవారం జీవీఎంసీ సర్వసభ్య సమావేశాన్ని కొనసాగించారు. సభ్యులంతా జీరో అవర్ కోసం పట్టుబట్టారు. దీనికి మేయర్ అంగీకరించడంతో ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రతి కార్పొరేటర్ తమ వార్డుల్లో సమస్యలు ప్రస్తావించారు. 98 వార్డులకు సంబంధించి సమస్యలను ఆయా వార్డు కార్పొరేటర్లు కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. ప్రధానంగా వీధి దీపాలు వెలగడం లేదని, కొన్ని వార్డుల్లో విద్యుత్ పోల్స్ బాగాలేవని పేర్కొన్నారు. డ్రైనేజీ, శానిటేషన్ సమస్య కూడా ఎక్కువగా ఉందని చెప్పారు. కొండవాలు ప్రాంతాల్లో రిటైనింగ్ వాల్స్ లేకపోవడంతో భారీ వర్షాల సమయంలో కొండ చరియలు విరిగిపడి, ఆస్తి, ప్రాణ నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని పలువురు కార్పొరేటర్లు తెలిపారు. దీంతో మేయర్ స్పందిస్తూ నెల రోజుల్లో జీవీఎంసీ పరిధిలోని అన్ని వార్డుల్లో వీధి దీపాల సమస్య పరిష్కరించాలన్నారు. శానిటేషన్ సమస్య ఉన్న వార్డుల్లో సిబ్బందిని పెంచాలని కమిషనర్‌కు, అధికారులకు ఆదేశించారు.

మేయర్‌తో పీతల మూర్తియాదవ్ వాగ్వాదం

తన 22వ వార్డులో యాదవ సామాజిక వర్గం ఎక్కువని, వారు పెంచుకునే పశువులు రోడ్లపైకి వెళితే ఫైన్‌లు వేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని, అలాంటి అధికారులపై చర్యలు తీసుకోవాలని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ డిమాండ్ చేశారు. దీనిపై వైఎస్సార్ సీపీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాస్ జోక్యం చేసుకుని.. 'ఎవరో చెప్పిన మాటల ఆధారంగా అధికారులపై చర్యలు తీసుకోవాలనడం సరికాదు.. అది నిజమని నిరూపిస్తే తక్షణ చర్యలు తీసుకుంటారు. ఆ మాత్రానికే గత ప్రభుత్వాన్ని, మా పార్టీ అధ్యక్షుడిని విమర్శిస్తారా.. జీరో అవర్‌లో కూడా వ్యక్తిగత దూషణలకు పాల్పడడం సరికాదు.. నీపై మీ ప్రభుత్వంలో పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. నీవు ఒక క్రిమినల్‌వంటూ' పీతలకు ఘాటుగా సమాధానం ఇచ్చారు. దీంతో తనను క్రిమినల్ అన్నారంటూ.. తక్షణమే ఆ మాటను వెనక్కి తీసుకోవాలని మూర్తి యాదవ్, కూటమి కార్పొరేటర్లు పోడియం వద్దకు వెళ్లి మేయర్‌తో వాగ్వాదానికి దిగారు. మేయర్‌ను ఏకవచనంతో దూషించారు. నా రూల్ పొజిషన్ నేను మాట్లాడతా.. మేయర్ చైర్‌కు గౌరవం ఇచ్చి మాట్లాడాలి. మీరు గత ప్రభుత్వంపై మాట్లాడిన మాటలు వెనక్కి తీసుకోవాలి.. జీరో అవర్‌లో స్థానిక సమస్యలు చెప్పాలి. కానీ మీరు వ్యక్తిగత దూషణలకు పాల్పడి, పరిమితిని మించి మాట్లాడుతున్నారు. సభా సంప్రదాయం పాటించకుంటే చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కార్పొరేటర్ బిపిన్ జైన్ సస్పెన్షన్

సభా సంప్రదాయలకు విరుద్ధంగా మాట్లాడినందుకు కార్పొరేటర్ బిపిన్ జైన్‌ను మేయర్ గొలగాని హరివెంకటకుమారి సస్పెండ్ చేశారు. జీరో అవర్‌లో బిపిన్ జైన్ తన వార్డు పరిధిలో జైల్ రోడ్డులో ఉన్న ఫుడ్ కోర్టును తొలగించాలని డిమాండ్ చేశారు. ఏడాదిన్నర క్రితం ఫుడ్ కోర్టు తీసేయాలని జీవీఎంసీ కౌన్సిల్ తీర్మానం చేసినా ఎందుకు చేయలేదంటూ ప్రశ్నించారు. నైట్ ఫుడ్‌కోర్ట్‌లో 101 దుకాణాలకు అనుమతులిస్తే.. ప్రస్తుతం 179 వరకు వచ్చేశాయన్నారు. మేయర్ స్పందిస్తూ.. వెంటనే అందరినీ అక్కడి నుంచి ఖాళీ చేయించాలని ఆదేశించారు. ఆ తర్వాత జీరో అవర్‌లో సమస్యలు చెప్పేందుకు అవకాశం కల్పించినా.. అన్‌పార్లమెంటరీ లాంగ్వేజ్‌తో మాట్లాడిన బిపిన్ జైన్‌ను సస్పెండ్ చేయాలంటూ కూటమి కార్పొరేటర్లు డిమాండ్ చేశారు. దీంతో కౌన్సిల్ సమావేశం వరకూ బిపిన్ జైన్‌ను సస్పెండ్ చేస్తూ మేయర్ ఆదేశాలు జారీ చేశారు.

కమీషన్లు పెరుగుతున్నాయి

సీపీఎం కార్పొరేటర్ బి.గంగారాం మాట్లాడుతూ.. కౌన్సిల్ సమావేశంలో అందరూ అవినీతిని రూపుమాపుదామని అన్నారు. చాలా మంచి పరిణామం. కానీ ఇది ఒక్కరితో కాదు.. అందరితో సాధ్యమయ్యేది. కాంట్రాక్ట్ పనుల్లో 5 శాతం కమీషన్ వచ్చేదంట. ఇప్పుడు ధరలు పెరిగి 8 శాతానికి చేరిందట. బ్యూరోక్రాట్స్‌కు 6 శాతం, కాంట్రాక్టర్లకు 30 శాతం ఇవ్వాలంట. ఇలా 44 శాతం కమీషన్లకే పోతే.. నాణ్యత ఎలా ఉంటుంది. అవినీతి లేకుండా కలిసి పనిచేద్దాం. అప్పుడు అవినీతి రహిత విశాఖ నగరం ఏర్పడుతుంది.. అని అన్నారు.

కౌన్సిల్లో హాయిగా 'నిద్ర'

కౌన్సిల్ ప్రారంభమైన రెండు గంటల తరువాత బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు వచ్చారు. గంటన్నర పాటు కౌన్సిల్‌లో ఉంటే.. అందులో గంటసేపు హాయిగా కునుకు పాట్లు తీశారు. ఇటు వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లపై కూటమి కార్పొరేటర్లు దాడికి యత్నిస్తున్నా, వాటిని పట్టించుకోకుండా హాయిగా నిద్రపోయారు. లంచ్ సమయం వరకు ఉండి వెళ్లిపోయారు.

బాణాలపై హనోక్ దాడికి యత్నం



బాణాలపై దాడికి యత్నిస్తున్న హనోక్

జీరో అవర్‌లో కంపా హనోక్ మాట్లాడుతూ గతంలో పనుల కోసం నాయకుల చుట్టూ తిరిగేవాళ్లమని.. అలాగే ప్రభుత్వ పెద్దల ఇళ్ల వద్దే రోడ్లు వేశారని ఇప్పుడు అలా కాకుండా చూడాలన్నారు. దీనిపై వైఎస్సార్‌సీపీ ఫ్లోర్ లీడర్ బాణాల స్పందించి ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలోకి వెళ్లే కంపాకు గత ప్రభుత్వాన్ని, తమ నాయకులను విమర్శించే నైతికత లేదన్నారు. టీడీఆర్‌ల అవినీతికి పాల్పడ్డావని బాణాలను ఉద్దేశించి హనోక్ విమర్శించగా. ఇప్పుడున్నది కూటమి ప్రభుత్వమే కదా దమ్ముంటే విచారించుకోవాలని బాణాల సవాల్ విసిరారు. ఈ సమయంలో నువ్వు డస్ట్ బిన్ నాయకుడివంటూ బాణాలపైకి కంపా హనోక్ దాడి చేసేందుకు మీదకి వచ్చారు. దీంతో ఇరు పార్టీల కార్పొరేటర్లు వెళ్లి వారించారు.

ఉద్యానవన డీడీపై విచారణకు మేయర్ ఆదేశం

అజెండాలోని 9వ అంశంలో ఉద్యానవన శాఖలో ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని కొనసాగిస్తూ ఆమోదం కోసం ప్రతిపాదించగా, కూటమి సభ్యులు అభ్యంతరం తెలిపారు. దీన్ని వాయిదా వేయాలని కోరారు. ఉద్యోగులు లేకున్నా.. ఉన్నట్లు అధికారులు జీతాలు డ్రా చేస్తున్నట్లు ఆరోపించారు. దీంతో కార్పొరేటర్ గంగారావు జోక్యం చేసుకుని వాయిదా సరికాదు. అధికారి తప్పు చేస్తే విచారణకు ఆదేశించాలని మేయర్‌ను కోరారు. దీంతో మేయర్ గొలగాని హరివెంకటకుమారి విచారణకు కమిషనర్‌ను ఆదేశించారు.

11 అంశాల ఆమోదం

అజెండాలో మొత్తం 75 అంశాలను పొందుపరిచారు. వీటిలో 14 అంశాలపై చర్చించగా తొలి 11 అంశాలు ఆమోదం పొందాయి. ఇందులో ప్రధానమైనవి కొన్ని..

- జీవీఎంసీ ఐటీ విభాగంలో సర్వర్, సాఫ్ట్‌వేర్ నిర్వహణకు 2024–25కుగాను అంచనా వ్యయం రూ.61,38,360 కేటాయింపు.
- జీవీఎంసీ ప్రజారోగ్య విభాగంలో పొరుగు సేవ పారిశుధ్య కార్మికులకు కొబ్బరి నూనె, సబ్బుల కొనుగోలుకు రూ.1.14 కోట్లు కేటాయిస్తూ ఆమోదం
- ప్రజారోగ్యం విభాగంలో ఔట్‌సోర్సింగ్ కార్మికులు 5,468 మందికి ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున రూ.54.68 లక్షల కేటాయింపు
- ఇంజినీరింగ్ విభాగంలో జోన్–7, జోన్–8లో మొత్తం 40 మంది వర్క్ ఇన్‌స్పెక్టర్లు(టెక్నికల్, నాన్ టెక్నికల్), లిఫ్ట్ ఆపరేటర్లు, సెక్యూరిటీ గార్డుల సేవలకు రూ.1.32 కోట్ల అంచనా వ్యయానికి ఆమోదం.
- బాల్యం విద్యాపథకం కింద ఔట్‌సోర్సింగ్ సిబ్బంది 46 మంది బాల్యం టీచర్లు, 42 మంది ఆయాలను కొనసాగించేందుకు రూ.84,82,860 కేటాయిస్తూ ఆమోదం.
- ఉద్యానవన విభాగంలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో 42 మంది ఉద్యోగుల కొనసాగింపునకు రూ.88.26 లక్షలు కేటాయిస్తూ ఆమోదం.
- రోడ్లపై సంచరిస్తున్న శునకాలు, పందులు, పశువుల నియంత్రణ కోసం ఏర్పాటు చేసిన ఔట్‌సోర్సింగ్ సిబ్బంది కొనసాగింపునకు రూ.156.72 కోట్ల కేటాయింపు.

చంద్రబాబుతో బేరం.. బీసీలకు కృష్ణయ్య ద్రోహం

- బీసీ గళం వినిపిస్తారని రాజ్యసభకు జగన్ పంపిస్తే అమ్ముడుపోయారు
- ప్రజల దృష్టి మరలించేందుకే తెరపైకి తిరుమల లడ్డూ వివాదం
- మాజీ మంత్రి కారుమూరు నాగేశ్వరరావు ధ్వజం



మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

ఎంవీపీకాలనీ: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుతో బేరం పెట్టుకుని, ఆర్.కృష్ణయ్య బీసీలకు ద్రోహం చేశారని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి కారుమూరు నాగేశ్వరరావు ధ్వజమెత్తారు. బుధవారం విశాఖలోని శాసన మండలి విపక్ష నేత, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ క్యాంప్ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. రాజ్యసభ సభ్యత్వానికి ఆర్.కృష్ణయ్య రాజీనామా చేయడాన్ని బీసీలకు చేసిన ద్రోహంగా అభివర్ణించారు. చట్టసభల్లో బీసీల గళం వినిపిస్తారన్న ఆకాంక్షతో కృష్ణయ్యను అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాజ్యసభకు పంపించారని తెలిపారు. చంద్రబాబు కొనుగోళ్లకు లొంగిన కృష్ణయ్య బీసీలకు వెన్నుపోటు పొడిచారని ఆక్షేపించారు. గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో బీసీలకే అగ్రతాంబూలం అందించారన్నారు. 14 ఏళ్లు సీఎంగా పనిచేసిన చంద్రబాబుకు ఏనాడూ.. ఒక్క బీసీని రాజ్యసభకు పంపించిన చరిత్రలేదన్నారు.

విషం చిమ్మేందుకే.. తిరుమల లడ్డూ వివాదం

వందరోజుల పాలనపై ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకతను దృష్టిమళ్లించడంతోపాటు, వైఎస్సార్ సీపీపై విషం చిమ్మేందుకే చంద్రబాబు శ్రీవారి లడ్డూ వివాదాన్ని తెరపైకి తెచ్చారన్నారు. లడ్డూలో కల్తీ నెయ్యి వినియోగించినట్లు అబద్ధాలు వల్లిస్తుంటే తనయుడు లోకేష్‌తో పాటు టీటీడీ ఈవో కల్తీ నెయ్యి ట్యాంకర్లను గుర్తించి వెనక్కిపంపేశాం, లడ్డూ ప్రసాదంలో ఆ నెయ్యి వినియోగించలేదని స్పష్టంగా చెబుతుండటం విడ్డూరంగా ఉందన్నారు. చంద్రబాబు నీచ రాజకీయానికి ఇది పరాకాష్ట అన్నారు. స్టీల్‌ప్లాంట్, విజయవాడ వరదలు, రాష్ట్రంలో హత్యలు, అత్యాచారాలు, అమలు కాని సూపర్‌సిక్స్ హామీల నుంచి ప్రజల వ్యతిరేకతను పక్కదోవ పట్టించేందుకే చంద్రబాబు శ్రీవారిని రాజకీయాల్లోకి లాగారంటూ మండిపడ్డారు. ఈ వ్యవహారంపై సీబీఐ దర్యాప్తు చేపట్టి, నిజాలు నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు. ఇందుకు అనుగుణంగా వైఎస్సార్‌సీపీ నాయకుడు వైవీ సుబ్బారెడ్డి సుప్రీం కోర్టులో కేసు వేసిన విషయాన్ని గుర్తుచేశారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎస్ఎంఎస్ ప్రమాదంపై కమిటీ ఏర్పాటు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ స్టీల్ మెల్ట్ షాప్‌లో మంగళవారం జరిగిన ప్రమాదంపై యాజమాన్యం ఐదుగురు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేసింది. పీపీఎం విభాగాధిపతి శంకర్‌జీ, ఎస్.ఎం.ఎస్-1 కు చెందిన ఆర్‌పి సింగ్, ఎస్ఎంఎస్-2కు చెందిన శశికాంత్, సేఫ్టీ విభాగానికి చెందిన ఎం.వరప్రసాద్, క్యూఏటీడీకి చెందిన అప్పారావు నాయుడులతో కమిటీను ఏర్పాటు చేశారు. 28 నాటికి కమిటీ నివేదిక అందజేయాలని స్టీల్‌ప్లాంట్ ఐరన్, స్టీల్, యుటిలిటీస్ సీజీఎం ఆర్.మొహంతి కోరారు.

నేడు హైపవర్ కమిటీ ఫార్మాసిటీ సందర్శన

మహారాణిపేట: పరిశ్రమలకు సంబంధించి హైపవర్ కమిటీ చైర్‌పర్సన్ వసుధ మిశ్రా గురువారం ఫార్మాసిటీలో పర్యటిస్తారు. ఇటీవల అచ్యుతాపురం, పరవాడలోని పలు ఫార్మాసిటీ కంపెనీల్లో ప్రమాదాల్లో జరిగిన సంగతి తెలిసిందే. ఆయా పరిశ్రమలను స్వయం పరిశీలించడానికి చైర్‌పర్సన్ గురువారం ఆ ప్రాంతాలకు వెళ్లనున్నారు.

భార్య మందలించిందని భర్త ఆత్మహత్య

మధురవాడ: తాగి వచ్చినందుకు భార్య మందలించిందని భర్త కొట్యాడ అప్పారావు(62) ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పీఎంపాలెం పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వాంబేకాలనీ 19వ బ్లాకులో కుల వృత్తి చేసుకునే అప్పారావు నివసిస్తున్నాడు. భార్య ఈశ్వరమ్మ ఓ ప్రైవేట్ స్కూల్లో ఆయాగా పనిచేస్తోంది. మృతుడు నిత్యం తాగి ఇంటికి వస్తూ ఉంటాడు. మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో తాగి వచ్చిన భర్తను ఈశ్వరమ్మ మందలించింది. దీంతో ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. మళ్లీ వచ్చేస్తాడులే అనుకుని, నిద్రలోకి జారుకుంది. బుధవారం ఉదయం 5.30 గంటల సమయంలో జీవీఎంసీ నీటి కోసం లేచి చూడగా, తమ బ్లాక్‌కి ఎదురుగా ఉన్న చెట్టుకు ఉరివేసుకుని భర్త శవమై కనిపించడంతో కన్నీరుమున్నీరుగా విలపించింది. పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అదానీ డేటా సెంటర్ స్థలం పరిశీలన

కొమ్మాది: కాపులుప్పాడలో గల అదానీ డేటా సెంటర్ స్థలాన్ని బుధవారం సాయంత్రం మంత్రి నారా లోకేష్, ఎంపీ శ్రీ భరత్‌తో కలిసి పరిశీలించారు. గతంలో ఇక్కడ అదానీ డేటా సెంటర్‌కు స్థలాన్ని కేటాయించారు. కొండపైకి వెళ్లేందుకు రోడ్డు నిర్మాణం పనులు మాత్రమే పూర్తయ్యాయి. ఇక్కడకు చేరుకున్న మంత్రి నారా లోకేష్ మీడియాను దగ్గరికి రానివ్వలేదు. 5 నిమిషాలపాటు స్థలాన్ని పరిశీలించి పయనమయ్యారు.

విదేశాల్లో ఉద్యోగాల పేరిట మోసం

- పోలీసులను ఆశ్రయించిన బాధితుని తండ్రి
- దర్యాప్తులో 8 కేసుల నమోదు, 19 మంది అరెస్ట్
- నగరానికి చెందిన యువకుడిని రక్షించిన పోలీసులు
- ఇప్పటి వరకు 85 మందిని రక్షించిన పోలీసులు


బాధితునితో కలిసి వివరాలు వెల్లడిస్తున్న సీపీ డాక్టర్ శంఖ బ్రత బాగ్చీ, జేసీపీ ఫకీరప్ప

అల్లిపురం: తక్కువ చదివినా పర్లేదు, విదేశాల్లో ఉద్యోగం, రూ.లక్షల్లో సంపాదన పేరిట నిరుద్యోగ యువతను నమ్మిస్తూ, వారిని సైబర్ నేరాలకు పావులుగా కంబోడియా, మయన్మార్, బ్యాంకాక్ వంటి దేశాల్లో నిర్వహిస్తున్న చైనా కంపెనీలకి తరలిస్తున్న ఏజెంట్ల నుంచి నగర పోలీసులు ఇప్పటి వరకు 85 మందిని రక్షించారు. ఈ మేరకు నగర పోలీస్ కమిషనరేట్ సమావేశ మందిరంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చి వివరాలు వెల్లడించారు. బాధితుల ఫిర్యాదు మేరకు 8 కేసుల్లో 19 మందిని అరెస్ట్ చేశామన్నారు. అదే కేసులో తాజాగా మయన్మార్‌లో చిక్కిన చినముషిడివాడకి చెందిన యువకుడిని రక్షించినట్లు తెలిపారు. మయన్మార్‌లోని ఇండియా రాయబార కార్యాలయంతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరిపి అక్కడ చిక్కుకున్న మరికొంత మందిని వెనక్కి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు పేర్కొన్నారు.

తాజాగా పోలీసులు రక్షించిన చినముషిడివాడకు చెందిన బాధితుడు మాట్లాడుతూ హాస్పిటల్ సెక్టార్ నందు బ్యాంకాక్‌లో ఉద్యోగానికి ఎంపికై, ఏప్రిల్ 25న బ్యాంకాక్ విమానాశ్రయంలో దిగినట్లు తెలిపారు. డీఎంకే విమానాశ్రయంలో ఉండగానే గుర్తుతెలియని చైనీయులు కిడ్నాప్ చేసి, మయన్మార్‌లోని చైనీస్ కంపెనీకి తీసుకెళ్లారన్నారు. అక్కడ స్కామింగ్ జాబ్ చేయించేందుకు ప్రయత్నిస్తే నిరాకరించినందుకు తనను కొట్టి, నిర్బంధించారన్నారు తప్పనిసరి పరిస్థితుల్లో వారు చెప్పినట్లు చేయాల్సి వచ్చిందన్నారు. తర్వాత ఇండియా పంపించేయండని పదేపదే అడిగితే డబ్బులు డిమాండ్ చేశారని, చెల్లించలేనని చెప్పడంతో వేరే చైనీస్ కంపెనీకి బలవంతంగా పంపించినట్లు తెలిపారు. అక్కడి నుంచి మరో చోటుకి, తర్వాత ఇంకో చోటుకి మార్చుతూ కోర్టులో 1500 టీహెచ్‌బీ ఫైన్ కట్టించి, బ్యాంకాక్ ఇమిగ్రేషన్ ఆఫీస్‌కు అప్పగించారన్నారు. ఇండియన్ ఎంబసీ తన వివరాలను పరిశీలించి, ఇండియా నుంచి టికెట్ బుక్ చేయించుకోవాల్సిందిగా చెప్పడంతో, తన తండ్రి కమిషనర్‌ను కలిశారని, వారి సహకారంతో విశాఖ చేరుకోగలిగినట్లు వెల్లడించారు. తనను రక్షించి, భారత్‌కు రప్పించిన పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సీపీ మాట్లాడుతూ విదేశీ ఉద్యోగ ప్రకటనలు, ఏజెంట్ల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిందిగా హెచ్చరించారు.

ఎందుకీ నిర్లక్ష్యం?

- యు-డైస్ ప్లస్ నమోదులో అలసత్వం
- తప్పులతడకగా విద్యార్థుల వివరాలు
- బయటపడిన డూప్లికేట్ ఫోన్ నంబర్లు
- ప్రైవేట్ స్కూళ్లలో ఇష్టారాజ్యం
- రాష్ట్ర సూచికలో అట్టడుగున అల్లూరి, విశాఖ జిల్లాలు


తరగతి గదిలో విద్యార్థులు

విశాఖ విద్య: యు-డైస్ ప్లస్ వెబ్‌సైట్‌లో వాస్తవ వివరాలు నమోదు చేయడంలో కొన్ని ప్రైవేట్ యాజమాన్యాలు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నాయి. పాఠశాల విద్య కమిషనరేట్ నుంచి తాజాగా విడుదల చేసిన గణాంకాలతో ఇది తేటతెల్లమైంది. జరిగిన తప్పిదాలను యుద్ధప్రాతిపదికన సరి చేయాలని కమిషనరేట్ నుంచి వచ్చిన ఆదేశాలతో జిల్లా విద్యాశాఖాధికారులు దృష్టి సారించారు. లోపం ఎక్కడ జరిగిందనే దానిపై ఆరా తీస్తున్నారు.

ఎన్ఈపీ అమల్లో భాగమే..

కేంద్ర ప్రభుత్వం జాతీయ విద్యా విధానం అమలుకు కట్టుబడి ఉన్న నేపథ్యంలో.. రాష్ట్రంలోనూ దీన్ని వర్తింపజేసేలా కూటమి ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోకతప్పడం లేదు. పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో విద్యార్థుల వివరాలను ఇప్పటివరకు యు-డైస్ పోర్టల్‌లో నమోదు చేస్తుండగా.. ఈ ఏడాది నుంచి కొత్తగా యు-డైస్ ప్లస్ అనే వెబ్‌సైట్‌ను తీసుకొచ్చారు. అంగన్‌వాడీ విద్యార్థులు మొదలుకుని ఇంటర్ వరకు విద్యార్థుల సమగ్ర వివరాలను యు-డైస్ ప్లస్ పోర్టల్‌లో నమోదు చేయాలని ఉన్నతాధికారులు దిశానిర్దేశం చేశారు.

ఆధార్‌తో అనుసంధానం

పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులను ఇటీవల వరకు చైల్డ్ ఇన్ఫోలో నమోదు చేసేవారు. ఆ తర్వాత యు డైస్‌లో పొందుపరిచారు. తాజాగా దీన్ని మరింత అప్‌డేట్ చేస్తూ యు డైస్ ప్లస్‌ను తీసుకొచ్చారు. ఇప్పటివరకు ఒకటి నుంచి 10వ తరగతి వరకు చదువుకునే విద్యార్థుల వివరాలు మాత్రమే ఇందులో అప్‌లోడ్ చేసేవారు. కానీ యు డైస్‌ప్లస్‌లో ఇంటర్ విద్యార్థుల వివరాలను కూడా నమోదు చేస్తున్నారు. ఆధార్ నంబర్ అనుసంధానంతో విద్యార్థుల వివరాలను నమోదు చేయడం ద్వారా మన రాష్ట్రంలోనే కాకుండా.. ఆ విద్యార్థి దేశంలో ఎక్కడ చదువుకునేందుకు వెళ్లినా ఆ వివరాలు తెలుస్తాయి. డ్రాపౌట్ నివారణతో పాటు చదువుకునే విద్యార్థులు ఎంతమనేది తెలుసుకునేలా కేంద్రప్రభుత్వం దీన్ని స్పెషల్ డ్రైవ్‌గా నిర్వహిస్తోంది.

ప్రైవేట్ స్కూళ్లలో అలసత్వం

యు డైస్ ప్లస్‌లో విద్యార్థుల వివరాలను నమోదు చేయడంలో కొన్ని కార్పొరేట్, ప్రైవేటు స్కూల్/కాలేజీల యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. తాజాగా విద్యాశాఖ కమిషనరేట్ నుంచి విడుదల చేసిన గణాంకాల జాబితాలో రాష్ట్రంలో కెల్లా అల్లూరి, విశాఖ జిల్లాలు అట్టడుగున నిలిచి పరిస్థితిని బయటపెట్టాయి. విశాఖ జిల్లాలో 10వ తరగతి, ఇంటర్మీడియెట్ విద్యార్థుల పేర్లు ఒక విద్యాలయంలో ఉంటే, పరీక్షలు మాత్రం వేరే చోట నుంచి ఫీజు చెల్లించి అక్కడ నుంచే రాయించేవారు. కానీ యు డైస్ ప్లస్‌లో నమోదు వల్ల ఇలాంటి తప్పిదాలకు చెక్ చెప్పినట్టయింది. దీంతో కొంతమంది ప్రైవేట్/కార్పొరేట్ కళాశాలల యాజమాన్యాలు తమ ఇష్టానుసారంగా విద్యార్థుల వివరాలను యు డైస్‌లో నమోదు చేస్తున్న విషయం బయటపడింది.

జిల్లా	విశాఖపట్నం	అనకాపల్లి	అల్లూరి
విద్యార్థులు	3,42,000	2,10,397	1,18,294
పేరెంట్ ఆధార్ లేని విద్యార్థుల సంఖ్య	88,362	42,188	47,931
ఫోన్ నంబర్ లేకుండా నమోదు చేసిన విద్యార్థుల సంఖ్య	7,070	2,003	2,629
డుప్లికేట్ ఫోన్ నంబర్‌తో నమోదు చేసిన విద్యార్థుల సంఖ్య	5,108	2,727	12,734

వాయు కాలుష్య నివారణకు పటిష్ట చర్యలు

ఎన్‌సీఏపీ సమీక్షలో కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్


ఎన్‌సీఏపీ కార్యక్రమాలపై సమీక్షిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, పాల్గొన్న అధికారులు

మహారాణిపేట: జిల్లాలో వాయు కాలుష్య నివారణ, గాలి నాణ్యత ప్రమాణాలు పెంపునకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం(ఎన్‌సీఏపీ)లో భాగంగా జిల్లాలో చేపడుతున్న చర్యలు, అభివృద్ధి ప్రాజెక్టులపై బుధవారం తన చాంబర్లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రధానంగా నగర పరిధిలో వాయు కాలుష్య కారకాలను గుర్తించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్య కూడళ్లలో వాటర్ ఫౌంటెన్లు ఏర్పాటు చేయాలన్నారు. నగరంలో అత్యంత కాలుష్య కారక ప్రాంతాన్ని గుర్తించి పైలట్ ప్రాజెక్టుగా చేపట్టి, ఆ ఫలితాల ఆధారంగా భవిష్యత్తు నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. జిల్లా పరిధిలో ఉండే పరిశ్రమల్లో వ్యర్థాల నిర్వహణ, కాలుష్య నివారణ చర్యలపై తరచూ పరిశీలించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. సాంకేతికతను వినియోగించుకుని కాలుష్య కారకాలను కన్వర్ట్ చేసి, దుష్ప్రభావాలు లేకుండా చూడాలన్నారు. భవిష్యత్తు చర్యలు, ప్రాజెక్టులపై అధికారులకు పలు సూచనలు చేశారు. విరివిగా మొక్కలు నాటాలన్నారు. సిగ్నల్ పాయింట్ల వద్ద వాహనాల ఇంజిన్ ఆపేలా వాహన చోదకుల్లో అవగాహన కల్పించడం, సైన్ బోర్డుల ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో కేంద్ర, రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, జీవీఎంసీ, రవాణా తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

పండగలకు ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం: పండగల వేళ ప్రయాణికుల రద్దీ దృష్ట్యా భువనేశ్వర్-యశ్వంత్‌పూర్-భువనేశ్వర్‌ల మధ్య వయా దువ్వాడ మీదుగా స్పెషల్ రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సందీప్ ప్రకటనలో తెలిపారు. భువనేశ్వర్-యశ్వంత్‌పూర్(02811) వీక్లీ ఏసీ స్పెషల్ ప్రతీ శనివారాల్లో భువనేశ్వర్‌లో రాత్రి 7.15 గంటలకు బయల్దేరి మరుసటిరోజు తెల్లవారు 1.53 గంటలకు దువ్వాడకు, అక్కడ నుంచి 1.55 గంటలకు బయల్దేరి సోమవారం 12.15 గంటలకు యశ్వంత్‌పూర్ చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైళ్లు అక్టోబరు 5వ తేదీ నుంచి నవంబరు 30వ తేదీ వరకు నడుస్తాయి.

తిరుగు ప్రయాణంలో యశ్వంత్‌పూర్-భువనేశ్వర్ (02812) వీక్లీ ఏసీ స్పెషల్ ప్రతీ సోమవారాల్లో తెల్లవారు 4.30 గంటలకు బయల్దేరి మరుసటిరోజు తెల్లవారు 4.30 గంటలకు దువ్వాడకు, అక్కడ నుంచి 4.32 గంటలకు బయల్దేరి అదేరోజు మధ్యాహ్నం 12.15 గంటలకు భువనేశ్వర్ చేరుకుంటాయి. ఈ స్పెషల్ రైళ్లు అక్టోబరు 7వ తేదీ నుంచి డిసెంబరు 2వ తేదీ వరకు నడుస్తాయి.

'ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మహాసభల్ని జయప్రదం చేయండి'

నవంబర్ 27 నుంచి 30 వరకు విశాఖలో నిర్వహణ


జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఏఐఎస్ఎఫ్ మహాసభల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జాన్సన్‌బాబు

సీతమ్మధార: అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్) 49వ రాష్ట్ర మహాసభల్ని జయప్రదం చేయాలని సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు వి.జాన్సన్ బాబు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం మహాసభల కరపత్రాలను జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబర్ 27 నుంచి 30 వరకు నాలుగు రోజుల పాటు విశాఖలో జరిగే మహాసభల్లో తొలి రోజు పదివేల మంది విద్యార్థులతో ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. మూడు రోజుల పాటు ఏఐఎస్ఎఫ్ డెలిగేట్స్‌తో చర్చలు జరిపి రాష్ట్ర కమిటీ ఎన్నిక జరుగుతుందన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలో కొనసాగేలా కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలంటూ మహాసభలో తీర్మానం చేసి, ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. గత ప్రభుత్వం 17 వైద్య కళాశాలలను నిర్మించిందని, రాయలసీమ మెడికల్ కళాశాలలో 50 సీట్లకు అనుమతించినా వాటిని సద్వినియోగం చేసుకోకుండా, ఆ సీట్లు అవసరం లేదంటూ తిరిగి లెటర్ రాయడాన్ని ఖండిస్తున్నామన్నారు. సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీను, నాగరాజు, నాయకులు లవకుమార్, గణేష్, మధు, గ్రేస్ ప్రకాష్, శేఖర్ పాల్గొన్నారు.

ఈవీఎం గోదాంలో వీవీ ప్యాట్‌ల పరిశీలన

ఆరిలోవ: రూరల్ తహసీల్దార్ కార్యాలయం పక్కన గల ఈవీఎం గోదాంను కలెక్టర్ ఎం.ఎన్ హరేంధిర ప్రసాద్ బుధవారం సందర్శించారు. గోదాంలో ఉన్న వీవీ ప్యాట్‌లను పరిశీలించారు. అక్కడ సీసీ కెమెరాల పనితీరు గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వీటికి పటిష్టమైన భద్రత అవసరమని, రక్షణ సిబ్బంది ఎలాంటి నిర్లక్ష్యం చూపవద్దని సూచించారు. ఈ పర్యటనలో ఎన్నికల విభాగం అధికారులు, పలు రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఉక్కు అధికారి కుటుంబం గిన్నిస్ రికార్డు


గిన్నిస్ అవార్డు అందుకుంటున్న సునీత, జస్లీన్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ భద్రతా విభాగం డీజీఎం ఎం వరప్రసాదరావు భార్య సునీత, కుమార్తె జస్లీన్‌లు గిన్నిస్ రికార్డు సాధించారు. మహిళా మనోవికాస్ వ్యవస్థాపకురాలు మాధవి సూరిభట్ల నేతృత్వంలో ఆదివారం నగరంలో జరిగిన పోటీల్లో 450 మంది అన్ని వయసుల చిన్నారులు, యువతులు, మహిళలు, వృద్ధులు పాల్గొన్నారు.ఇందులో పాల్గొన్న తల్లీ కూతురు అతి తక్కువ సమయంలో నూలు వస్త్రంతో 58,112 క్రోంచెట్ స్క్వేర్‌లు తయారు చేసి వరల్డ్ రికార్డు సాధించారు. గిన్నిస్ వరల్డ్ రికార్డ్ లండన్ ప్రతినిధి స్వప్నిల్ డంగారికర్ 'లార్జెస్ట్ డిస్‌ప్లే ఆఫ్ క్రోంచెట్ స్క్వేర్స్' గా గిన్నిస్ రికార్డ్‌ను ధ్రువీకరించారు. ఈ మేరకు సునీత, జస్లీన్‌కు గిన్నిస్ రికార్డ్‌లు ప్రదానం చేశారు. సునీతకు ఈ అంశంలో ఇది రెండో గిన్నిస్ రికార్డు కాగా జస్లీన్‌కు ఇది మొదటిగిన్నిస్ రికార్డు. సునీత, జస్లీన్‌లు గిన్నిస్ రికార్డులు సాధించడంపై ఉక్కు ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజా సేవలోనే ఆనందం

- మారుమూల గిరిజన మహిళకు మాజీ సీఎం జగన్ అవకాశం
- జెడ్పీ చైర్‌పర్సన్‌గా మూడేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా జల్లిపల్లి సుభద్ర


ఉద్యోగులు, అధికారులకు కేక్ తినిపిస్తున్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర

మహారాణిపేట: ప్రజాసేవలో తనకు ఎంతో ఆనందం ఉంటుందని జిల్లా పరిషత్తు చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా మూడేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా జెడ్పీ ఉద్యోగులు ఆమెను తన బంగ్లాలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కట్ చేసి సంతోషాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా సుభద్ర మాట్లాడుతూ రాజకీయాలే పరిచయం లేని తనను మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవకాశాన్ని కల్పించారన్నారు. ఏ ఆశయ సాధన కోసం తనకి అవకాశాన్నిచ్చారో, ఆ లక్ష్య సాధన కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు. ఆదివాసీల జీవితాల్లో వెలుగులు నింపాలన్న జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్షలు నెరవేర్చేలా నిరంతరం కృషి చేస్తున్నానన్నారు. గిరిజనులకు అందని ద్రాక్షగా మిగిలిన విద్య, వైద్యంలో సమూల మార్పులకు కృషి చేసిన సంతోషం తనకు దక్కిందన్నారు. కేజీహెచ్ ఎస్టీ సెల్ అంటే భయపడే స్థితి నుంచి అక్కడ మెరుగైన వైద్యం అందుతుందన్న నమ్మకాన్ని గిరిజనుల్లో పెంచేందుకు జరిగిన కృషిలో తన భాగస్వామ్యాన్ని అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. విద్యా వ్యవస్థలో సమూల మార్పులు రావాలన్న జగన్ ఆశయ సాధన దిశగా తాను కూడా అడుగులు వేసినందుకు సంతోషంగా ఉందన్నారు. తనకు ఇచ్చిన అవకాశం మేరకు పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉద్యోగులు పాల్గొన్నారు.

కూతురిపై తండ్రి అత్యాచారం

ఆరిలోవ: పదమూడేళ్ల కూతురిపై ఓ తండ్రి అత్యాచారానికి పాల్పడినట్లు ఆరిలోవ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఆరిలోవ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశాకు చెందిన చిత్తరంజన్ పాత్రో(40) కుటుంబంతో కొన్నాళ్ల క్రితం విశాఖ వచ్చి ఆరిలోవ ప్రాంతం ఆరిలోవ కాలనీలో ఉంటున్నారు. మద్యానికి బానిసైన పాత్రో కూలి పనులకు పెద్దగా వెళ్లేండేవాడు కాదు. అతని భార్య నగరంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. పదమూడేళ్ల పెద్ద కుమార్తె తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతోంది. ఆమె రెండు రోజులుగా కళ్లు తిరిగి తరగతి గదిలో పడిపోతుంది. మంగళవారం కూడా అదే మాదిరిగా కళ్లు తిరిగి పడిపోవడంతో ఆ బాలికను తరగతి ఉపాధ్యాయురాలు దగ్గరకు తీసుకొని ఆరా తీశారు. దీంతో ఆ బాలిక జరిగిన విషయమంతా ఆ ఉపాధ్యాయురాలికి వివరించింది. తన తల్లి ప్రతి రోజు రాత్రి డ్యూటీకి ఆస్పత్రికి వెళ్తుందని, దీంతో తన తండ్రి తనపై అత్యాచారం చేస్తున్నాడని తెలిపింది. దీంతో విస్తుపోయిన ఉపాధ్యాయురాలు విషయాన్ని హెచ్ఎం, తోటి ఉపాధ్యాయులకు తెలియజేసింది. వారు ఆరిలోవ పోలీసులకు తెలియజేశారు. పోలీసులు బాలికను విచారించారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు చిత్తరంజన్ పాత్రోను అదుపులోకి తీసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణ తెలిపారు.

రేపటి నుంచి వైశాఖీ నృత్యోత్సవం

- కళాభారతి వేదికగా అఖిల భారత శాస్త్రీయ నృత్యోత్సవం
- మూడు రోజుల పాటు 11 నృత్య ప్రదర్శనలు

మద్దిలపాలెం: వైశాఖీ నృత్యోత్సవం-2024 స్థానిక కళాభారతి ఆడిటోరియంలో ఈ నెల 27, 28, 29 తేదీల్లో రోజూ సాయంత్రం నాట్యప్రియుల్ని సమ్మోహనం చేయనుంది. నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ ఆధ్వర్యంలో దేశం నలుమూలల నుంచి సనాతన, సంప్రదాయ నాట్య నిపుణులు ఒకే వేదిక మీదకు రానున్నారు. మూడు రోజులపాటు జరిగే నృత్యోత్సవంలో 11 వైవిధ్యభరిత బృంద, ఏకకేళి నాట్య ప్రదర్శనలుంటాయని నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాల్లో ప్రదర్శనలిచ్చే కళాకారులకు నిపుణుల కమిటీ ఎంపిక మేరకు ఏరోజుకారోజు అతిథుల చేతుల మీదుగా పురస్కారాలను అందించనున్నట్లు అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు బీఆర్ విక్రమ్ కుమార్(గౌడ్) తెలిపారు. ఈ నృత్యోత్సవాలను నాట్యప్రియులు ఉచితంగా తిలకించవచ్చన్నారు.

ప్రదర్శనల క్రమం

- తొలిరోజు(27)న పద్మశ్రీ ప్రతిభా ప్రహ్లాద్(న్యూఢిల్లీ) భరతనాట్యం, పౌశాలీ ఛటర్జీ బృందం(పశ్చిమ బెంగాల్) మణిపురి నాట్యం, జై మా దుర్గా కళాపరిషత్ బృందం(ఒడిశా) సంబల్‌పురి నృత్య ప్రదర్శనలు.
- రెండోరోజు(28)న పద్మశ్రీ ఇలియానా సిటారిస్టి బృందం(ఒడిశా) ఒడిస్సీ నాట్యం, నాట్యశ్రీ గీతానారాయణ్ సూదగాని(ఆంధ్రప్రదేశ్) కూచిపూడి, దుర్గా ఆర్య బృందం(జర్మనీ) కథక్, రీతూ ఆకాష్ లావని(నాగ్‌పూర్) జానపద నృత్య ప్రదర్శనలు.
- ఆఖరిరోజు(29)న కళైమామణి మూర్తి మాధవపెద్ది(తమిళనాడు) కూచిపూడి, రూపశ్రీ మహాపాత్ర బృందం(ఒడిశా) మహరి నృత్యం, నాట్యశ్రీ చిత్ర సుకుమారన్(కేరళ) మోహినీయాట్టం, కళింగ పైకా సృజనాత్మక బృందం(ఒడిశా) పైకా జానపద నృత్య ప్రదర్శనలు ఉంటాయి.

పురస్కారాల ప్రదానం

నృత్యోత్సవ్‌లో భాగంగా వైశాఖీ లైఫ్ టైం ఎచీవ్‌మెంట్ అవార్డులు పద్మశ్రీ ప్రతిభా ప్రహ్లాద్, పద్మశ్రీ ఇలియానా సిటారిస్టి బృందం, పద్మభూషణ్ గురు డాక్టర్ సరోజా వైద్యనాథన్ ఎక్స్‌లెన్స్ అవార్డు-2024. డాక్టర్ పి.రమాదేవి(హైదరాబాద్) కూచిపూడి, దుర్గా ఆర్య బృందం(జర్మనీ)కు అందించనున్నారు.